

కల్యాణ వేంకటేశ్వర స్వామి కల్యాణం

దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డు సమీపంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం సోమవారం వైభవంగా జరిగింది.



మహాలక్ష్మికి లక్ష మల్లెల పూజ

తెనాలి: అంగలకురుదులో వేంచేసిఉన్న మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో సోమవారం అమ్మవారికి లక్ష మల్లెపూలతో, పలు ద్రవ్యాలతో విశేష పూజలు చేశారు.

16 రోజుల పండుగ వేడుకలు



గోలి(రెంటచింతల): గోలి గ్రామంలో అతిపురాతనమైన నాగేంద్రస్వామి వారి దేవస్థానంలోని నీలంపాటి అమ్మవారి ఆలయం 16 రోజుల పండుగ వేడుకలు సోమవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

భగవద్గీత అవగాహన అంశంలో పుష్పలతకు గోల్డ్ మెడల్



చీరాల: రోటరీ క్లబ్ క్షీరపురి మాజీ అధ్యక్షురాలు నన్నపనేని రామకృష్ణ సతీమణి నన్నపనేని పుష్పలత మైసూరు గణపతి సచ్చిదానంద స్వామిజీ నిర్వహించిన భగవద్గీత అవగాహన అంశంలో గోల్డ్ మెడల్ సాధించారు. ఆదివారం రాత్రి మైసూరులోని స్వామిజీ ఆశ్రమంలో జరిగిన కార్యక్రమంలో ఆమెకు స్వామిజీ గోల్డ్ మెడల్ అందించారు. ఈనెల 2న ఆన్‌లైన్ వీడియో కాల్‌లో పీఠానికి చెందిన ఐదుగురు గురువులు భగవద్గీతపై 90 నిమిషాలపాటు పలు రకాల ప్రశ్నలు వేశారు. వీడియోకాల్ నిర్వహణలో కళ్లు మూసుకుని మాత్రమే సమాధానం చెప్పాలన్నారు. ఆన్‌లైన్‌లో వివిధ పీఠాలకు సంబంధించిన 20 మంది పరిశీలిస్తుంటారని ఆమె తెలిపారు. స్వామిజీ చేతుల మీదగా గోల్డ్ మెడల్‌తో పాటు ఆయన ఆశీర్వచనాలు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు.

ఆర్టీసీ స్థలాల లీజుపై 22న సమావేశం

పట్నంబజారు: గుంటూరు జిల్లా పరిధిలోని పెదకాకాని, తెనాలి, పెదనందిపాడు బస్సు స్టేషన్ల పరిధిలో ఖాళీగా ఉన్న ఆర్టీసీ స్థలాలను లీజు ప్రాతిపదికన ఇచ్చేందుకు ఈనెల 22న గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ఉదయం 10 గంటలకు సమావేశం ఏర్పాటు చేసినట్లు రీజియన్ మేనేజర్ ఎం.రవికాంత్ తెలిపారు. ఆసక్తి గల వారు ఆ రోజు సమావేశానికి హాజరుకావాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాల కోసం ఏపీఎస్ ఆర్టీసీ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ఆర్టీసీ.ఏపీ.జీవోవి.ఇన్‌లో లేదా 9959225412 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

గరుడ వాహనంపై గ్రామోత్సవం



తెనాలి టౌన్: వైకుంఠపురంలోని శ్రీ లక్ష్మీపద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఏడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు సోమవారం ఉదయం 7.30 గంటలకు నిత్య హోమం, బలిహరణ, ఉదయం 8గంటలకు గరుడ వాహనంపై పురవీధుల్లో స్వామి గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు దివ్య రథోత్సవం, ప్రత్యేక పుష్పాలంకరణ, మేళతాళాలు, విద్యుత్ దీప కాంతుల నడుమ స్వామి గ్రామోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. పట్టణ ప్రజలంతా తిలకించి తరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమాలను ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి మంతెన అనుపమ పర్యవేక్షించారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు



నరసరావుపేట: మాదక ద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు కోరారు. సోమవారం కార్యాలయంలో నష ముక్త్ భారత్ అభియాన్ 2.0లో భాగంగా మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలను తెలియచేసే పోస్టర్లను ఆవిష్కరించారు. డీఆర్‌ఓ ఏకా మురళి, డీఈఓ చంద్రకళ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సీఎస్ వీడియో కాన్ఫరెన్స్..

అంతర్జాతీయ యోగా దినోత్సవం ఏర్పాట్లు, స్టేట్ ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు తదితర అంశాలపై సోమవారం జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర చీఫ్ సెక్రటరీ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పి.అరుణ్‌బాబు, జేసీ సూరజ్ గనోరే హాజరయ్యారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 512.70 అడుగుల వద్ద ఉంది. ఇది 136.3008 టీఎంసీలకు సమానం.

రైతు ఊపిరితీస్తున్న బ్లాక్ బర్లీ

- పేరుకుపోయిన పొగాకు నిల్వలు
- కొనుగోలుకు ఆసక్తి చూపని టుబాకో కంపెనీలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- బాధ తట్టుకోలేక ఓ రైతు ఆత్మహత్య
- ప్రభుత్వం ఆదుకోకుంటే అందరిదీ అదే బాట అంటున్న రైతులు

సాక్షి ప్రతినిధి,బాపట్ల: పండించిన పొగాకు పంట మొత్తాన్ని కొంటామని హామీ ఇచ్చిన టుబాకో కంపెనీలు ఈ ఏడాది ఒక్క క్వింటా కూడా కొనక అన్నదాతలను వంచించాయి. రైతులను ఆదుకోవాల్సిన చంద్రబాబు ప్రభుత్వం ముఖం చాటేసింది. ఇప్పటికే పర్చూరు మండలం వీరన్నపాలెంకు చెందిన రైతు ఉప్పుటూరి సాంబశివరావు ఆత్మహత్య చేసుకోగా మరికొందరు అదేబాటలో ఉన్నారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం క్వింటా పొగాకుకు రూ.15 నుంచి రూ.18 వేల ధర ఇచ్చి రైతులను ఆదుకోగా కూటమి ప్రభుత్వం రైతులను గాలికి వదిలేసింది. బయట మార్కెట్‌లో క్వింటా రూ.5 వేలకు అమ్ముకోలేక రైతులు విలపిస్తున్నారు. అప్పులోళ్ల ఒత్తిళ్లు పెరగడంతో ఆందోళన చెందుతున్నారు. పొగాకు రైతుల కష్టాలు తెలుసుకునేందుకు 'సాక్షి' ఇంకొల్లు మండలం వంకాయలపాడు, సుబ్బారెడ్డిపాలెం, పర్చూరు మండలం ఉప్పుటూరు, వీరన్నపాలెం గ్రామాల్లో పర్యటించింది.

కష్టమంతా వర్షార్పణం

ఇంకొల్లు మండలం వంకాయలపాడు చేరుకోగా ముందు రోజు రాత్రి కురిసిన వర్షానికి పొగాకు తడిసిపోయింది. కొందరు రైతులు తడిసిన పొగాకును ఆరబెట్టుకుంటున్నారు. మరికొందరు ప్లాస్టిక్ పట్టలు కప్పి కాపాడుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. రైతు రామలింగారెడ్డి రూ.12 లక్షలు పెట్టుబడులు పెట్టి 8 ఎకరాలలో సాగు చేసిన బ్లాక్ బర్లీ పొగాకు మొత్తం వర్షానికి తడిసిపోయింది. ఇంటి మనుషులతోపాటు కూలీలను పెట్టి రోడ్డుపైనే ఆరబెట్టుకుంటున్నాడు. పొగాకు కొంటామని చెప్పి జీపీఐతోపాటు మిగిలిన టుబాకో కంపెనీలు మోసం చేశాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



వంకాయలపాడులో తడిసిన పొగాకు ఆరబెట్టుకుంటున్న రైతులు

జిల్లాలో బ్లాక్‌బర్లీ సాగు ఇలా....

బాపట్ల జిల్లాలోని పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లో బ్లాక్‌బర్లీ, వైట్ బర్లీ, ఎఫ్‌సీవీ పొగాకు కలిపి 63,471 ఎకరాల్లో సాగుకాగా ఒక్క బ్లాక్ బర్లీ 53,067 ఎకరాల్లో సాగైంది. పర్చూరు నియోజకవర్గంలోనే 52,989 ఎకరాల్లో సాగుచేశారు. ఇప్పటివరకూ 5.60 లక్షల క్వింటాళ్లకు పైగా పొగాకు రైతుల వద్దే ఉండిపోయింది.

ఊరంతా పొగాకు గుట్టలే...

వంకాయలపాడు గ్రామంలో 100 మంది రైతులు 400 ఎకరాల్లో బ్లాక్ బర్లీ సాగుచేశారు. సుబ్బారెడ్డిపాలెం గ్రామంలో 120 మంది రైతులు 500 ఎకరాల్లో పొగాకు సాగుచేశారు. ప్రభుత్వం వెంటనే పొగాకు కొనిపించకపోతే చాలామంది రైతులు ప్రాణాలు బలిపెట్టుకుంటారని రైతు సంజీవరెడ్డితోపాటు మిగిలినవారు వాపోయారు. ఉప్పుటూరు చెరువు పక్కన రోడ్డు పైన ఉన్న ఖాళీ స్థలంలో వందలాది కొలు రైతుల పొగాకు గుట్టలుగా కనిపించాయి. 10 ఎకరాలు సాగుచేసిన సుధాకర్, 15 ఎకరాలు పండించిన అబ్దుల్ రజాక్, 20 ఎకరాలు వేసిన కోటయ్య, 10 ఎకరాలు వేసిన బాల కోటయ్య, 30 ఎకరాలు సాగు చేసిన షేక్ మొహిద్దీన్, 5 ఎకరాల షేక్ హుషన్ బాషా, 14 ఎకరాల అప్పారావుతోపాటు అందరూ కష్టాలు ఏకరువు పెట్టారు. ఒక్క ఉప్పుటూరులోనే ప్రస్తుతం వెయ్యిలారీల పొగాకు సిద్ధంగా ఉందన్నారు.



వంకాయలపాడు పొలాల్లో 'సాక్షి'కి కష్టాలు వివరిస్తున్న రైతులు

ప్రభుత్వం ఆదుకోవాలి



పర్చూరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో వేలాది మంది రైతులు బ్లాక్ బర్లీ సాగుచేశారు. పంట చేతికొచ్చి నెల అవుతున్నా కంపెనీలు క్వింటా కూడా కొనలేదు. కంపెనీలు ఇచ్చిన హామీతోనే రైతులు పొగాకు సాగుచేశారు. తక్షణం ప్రభుత్వం స్పందించి రైతుల వద్ద ఉన్న పొగాకు వెంటనే గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలి. లేకపోతే రైతులతో కలిసి ఆందోళనకు దిగుతాం.

–గాదె మధుసూదనరెడ్డి, వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త

కొనకపోతే చచ్చిపోవాల్సిందే!



ఎకరాలకు రూ.1.70 లక్షల వంతున రూ.13.60 లక్షలు అప్పులు తెచ్చి 8 ఎకరాలలో పొగాకు సాగుచేశాం. కంపెనీలు ఒక్క క్వింటా కొనలేదు. కూలీ డబ్బులు కూడా ఇవ్వలేకున్నాం. గత ప్రభుత్వంలో మంచి ధర ఇచ్చి ఎప్పటికప్పుడు కొన్నారు. ఇప్పుడు కొనేదిక్కులేదు. పొగాకు దాచుకునే అవకాశం లేక వర్షానికి తడిసి పనికి రాకుండా పోతోంది. ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయకపోతే అందరం చనిపోవాల్సిందే.

భవనం శ్రీలక్ష్మి, వంకాయలపాడు, ఇంకొల్లు మండలం

ప్రభుత్వం స్పందించాలి



ఇంకొల్లుతోపాటు నియోజకవర్గంలో రైతులు బ్లాక్ బర్లీ అధికంగా సాగు చేశారు. గతంలో సాగుచేయమని చెప్పి తీరా పంట చేతికొచ్చాక కంపెనీలు మోసగిస్తే ఎలా? రైతుల వద్ద పంట మొత్తాన్ని కొనాల్సిందే! ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకొని కంపెనీలతో కొనిపించడమా? లేదా ప్రభుత్వమే కొనడమో చేయాలి.

భవనం శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ, ఇంకొల్లు మండలం

ఇంత దుస్థితి ఎన్నడూ లేదు



గత ప్రభుత్వంలో క్వింటా బ్లాక్ బర్లీ రూ.18 వేలకు తగ్గకుండా కొన్నారు. గుళ్లాకు సైతం రూ.9 వేలకు కొన్నారు. ఇప్పుడు రూ.6 వేలకు కూడా కొనేవారు లేరు. నేను ఐదెకరాలు సాగుచేస్తే దాదాపు రూ.8 లక్షలు పెట్టుబడి పెట్టాను. కూలీలకు కూడా డబ్బులు కట్టలేకున్నాం.

వంకాయలపాటి సాంబశివరావు, రైతు, వంకాయలపాడు, ఇంకొల్లు మండలం

క్వింటా కూడా కొనలేదు

10 ఎకరాలు కౌలుకు తీసుకొని రూ.15 లక్షలు పెట్టుబడి పెట్టి పంట సాగు చేశా. కంపెనీలు ఒక్క క్వింటా కూడా కొనలేదు. గత ప్రభుత్వంలో మాదిరి ధర ఉండి ఉంటే రూ.21.60 లక్షలు వచ్చేదని, ప్రస్తుత ధరకు అమ్మితే రూ.6 లక్షలు కూడా రాదు.

–వంకాయలపాటి రఘుబాబు

పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీలు పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి
- 170 అర్జీలు స్వీకరణ

బాపట్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలపై ఆడిట్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు అర్జీల ద్వారా తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. 170 అర్జీలు స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను కలెక్టర్ సావధానంగా విన్నారు. వాటికి అక్కడికక్కడే ఆయన పరిష్కార మార్గం చూపారు. తన పరిధిలో లేని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. కొన్నింటిని క్షేత్రస్థాయి పరిశీలనకు, మరికొన్నింటిని విచారించాలని అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్‌లో నమోదయ్యే ప్రతి అర్జీని అధికారులు నిశితంగా పరిశీలించి, పరిష్కరించాలని కలెక్టర్ చెప్పారు. పరిష్కరించిన అనంతరం అర్జీదారుని ఇంటి వద్దకు వెళ్లి ఫొటో అప్‌లోడ్ చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్‌గౌడ్, బాపట్ల ఆర్డీఓ పి గ్లోరియా, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ప్రజా సమస్యల పరిష్కారవేదికలో అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

తాగునీటి సమస్య పరిష్కరించాలి

బాపట్ల పట్టణంలోని పలు కాలనీలో తాగునీటి సమస్య ఉంది. మున్సిపల్ డీఈకి ఫోన్ చేసినా, వ్యక్తిగతంగా వెళ్లి అర్జీ ఇచ్చినా పట్టించుకోవటం లేదు. వైఎస్సార్‌కాలనీలో నీరు రాకపోగా కనీసం ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయటంలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

–సంపతమ్మ, రాజారావు, సమాజ్‌వాది పార్టీ నాయకులు

రికార్డులు తారుమారు చేశారు

సర్వే నెంబరు 11లో మా పూర్వీకుల ఆస్తిలో 1.70 ఎకరాలు ఉంది. పాశం శ్రీరాములరెడ్డికి ఎకరం ఉండగా అదనంగా మరో 20 సెంట్లు కలిపి పాసుపుస్తకాలు ఇచ్చారు. ఈ విషయంపై ఎన్నిసార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. జాయింట్ కలెక్టర్ ఆదేశించినా చర్యలు తీసుకోవటంలేదు.

–ఇడమకంటి విజయభాస్కర్‌రెడ్డి, శంకవరప్పాడు, అద్దంకి మండలం

భూములు ఇచ్చేందుకు ఒప్పుకోం

శంకరలింగం గుడిపాడు గ్రామంలో సోలార్ పార్కు నిర్మించేందుకు ప్రభుత్వం స్వచ్ఛందంగా భూములు సేకరించేందుకు సిద్ధమైంది. గ్రామస్తులు ఎక్కువ మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. భూములు ఇవ్వటం వలన జీవనాధారం కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తోంది. ప్రభుత్వం సారవంతమైన తమ భూముల్లో కాకుండా సోలార్ పార్కు నిరుపయోగంగా ఉన్న భూముల్లో ఏర్పాటు చేయాలి.

–గుంజి వెంకటేశ్వర్లు, రవి దేవిరాజు, బల్లికురవ మండలం

జై శ్రీరామ్ నామస్మరణతో మార్మోగిన శింగరకొండ

వైభవంగా మహా కుంభాభిషేకం

- 3 వేల మంది మహిళలతో శోభాయాత్ర
- గుండ్లకమ్మ నది నుంచి శింగరకొండ వరకు శోభాయాత్ర
- శోభాయాత్రలో నడిచిన మేనక (ఏనుగు)
- ప్రత్యేక అతిథిగా హాజరైన శృంగేరీ శారదా పీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతిస్వామి



శోభాయాత్రలో పాల్గొన్న వేలాది మంది మహిళలు, ప్రసన్నాంజనేయస్వామి మూలవిరాట్(ఇన్‌సెట్‌లో)

అద్దంకి/అద్దంకిరూరల్: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి ప్రాంగణం 'జై శ్రీరామ్.. జై ఆంజనేయం, ప్రసన్నాంజనేయం' నామస్మరణతో మార్మోగిపోయింది. సోమవారం మహా కుంభాభిషేక నూతన ఆలయ ప్రారంభం, విమాన శిఖర కలశ ప్రతిష్ట, జీవ ధ్వజ స్తంభ ప్రతిష్ట కార్యక్రమాలు దేవదాయశాఖ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ నెల 14న ప్రారంభమైన కార్యక్రమాలు సోమవారంతో ముగిశాయి. కుంభాభిషేకంలో భాగంగా విమాన శిఖర కలశ ప్రతిష్ట, నూతన ఆలయ ధ్వజ స్తంభ ప్రతిష్ట నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 3 వేల మంది మహిళా భక్తులతో ఉదయాన్నే అద్దంకి పట్టణానికి సమీపంలో ఉన్న గుండ్లకమ్మ నది నుంచి మూడు వేల కళశాలతో జలాన్ని తీసుకుని 'జై శ్రీరామ్.. జైశ్రీరామ్' నామస్మరణ చేసుకుంటూ శింగరకొండ వరకు శోభాయాత్ర నిర్వహించారు. కేరళ వాయిద్యాలు, ప్రత్యేక నృత్యాలతో, దేవతా వేషధారణల విన్యాసాలతో కన్నుల పండువగా సాగింది.

కిక్కిరిసిన క్యూలైన్లు..

కుంభాభిషేక కార్యక్రమాన్ని శృంగేరీ శారదాపీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతిస్వామి నిర్వహించారు. కుంభాభిషేకానికి హాజరైన భక్తులతో క్షేత్రంలోని ప్రత్యేక క్యూలైన్లు కిక్కిరిశాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వివిధ సామాజిక వర్గాల్లోని సత్రాల్లో అన్నదానంతోపాటు, దేవాలయ అధికారుల ఆధ్వర్యంలో 30 వేల మందికి అన్న సంతర్పణ చేశారు. అద్దంకి బస్టాండ్ నుంచి భవిష్య పాఠశాలకు చెందిన రెండు బస్సులు భక్తులను ఉచితంగా చేరవేశాయి. కోటా శ్రీనివాసకుమార్ భక్తులకు తాగునీరు సరఫరా చేశారు.

పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి గొట్టిపాటి

ప్రసన్నాంజనేయ స్వామికి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పట్టువస్త్రాలు సమర్పించారు. మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యుత్‌శాఖ మంత్రి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎం తిమ్మనాయుడు, సిబ్బంది పర్యవేక్షించారు. బందోబస్తును చీరాల డీఎస్పీ మొయిన్, అద్దంకి సీఐ సుబ్బరాజు పర్యవేక్షించారు.

మహిమాన్వితుడు ఆంజనేయస్వామి



లక్షల డబ్బు ఖర్చు పెట్టే పని లేకుండా 108 సార్లు రామనామ జపం చేస్తే చాలా ఎక్కువ ఫలితం పొందవచ్చని శృంగేరీ శారదాపీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతిస్వామి అన్నారు. మహా కుంభాభిషేకం అనంతరం ఆయన భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. రామాయణంలోని సుందరకాండలో, కిష్కింధకాండలో ఆంజనేయస్వామి దివ్యమైన చరిత్ర మనకు తెలుస్తుందని చెప్పారు. అనాది కాలం నుంచి ఆంజనేయస్వామి ఆరాధనను చేయడం సంప్రదాయంగా వస్తుందని, ఆయన మహిమ అపారమైనదన్నారు. శింగరకొండలో ఒకే దేవతను రెండు రూపాల్లో కొండపైన లక్ష్మీ నరసింహస్వామి గానూ, కొండ కింద ఆంజనేయస్వామిగానూ మనకు దర్శనం ఇస్తున్నారన్నారు. శింగరకొండ దివ్య క్షేత్రమని చెప్పారు. అటువంటి క్షేత్రంలో ఆ స్వామికి నూతనాలయం, నూతన విమాన గోపుర, కలశ ప్రతిష్ఠ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో పాల్గొన్న వారంతా భగవత్ అనుగ్రహానికి పాత్రులు అయ్యారన్నారు. ఏదో పూర్వజన్మ పుణ్యం ఉంటేనే ఇటువంటి కార్యక్రమాల్లో పాలు పంచుకుంటారని చెప్పారు.

వైఎస్సార్ సీపీదే విజయం

- వైస్ ఎంపీపీగా దొంతిరెడ్డి సింధు ఏకగ్రీవం
- అభినందనలు తెలిపిన వైఎస్సార్ సీపీ నాయకులు

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): పిట్టలవానిపాలెం మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్షురాలిగా వైఎస్సార్ సీపీ అభ్యర్థి, భవనంవారిపాలెం ఎంపీటీసీ సభ్యురాలు దొంతిరెడ్డి సింధు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం వైస్ ఎంపీపీ ఎన్నిక నిర్వహించారు. మండలంలో మొత్తం 11మంది ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. వీరిలో 10మంది వైఎస్సార్ సీపీ సభ్యులు ఉన్నారు. ఒకరు టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు ఉన్నాడు. గతంలో వైస్ ఎంపీపీగా పనిచేసిన పిట్టువారిపాలెం ఎంపీటీసీ సభ్యుడు దెందుకూరి సీతారామరాజు మార్చినెలలో జరిగిన ఎన్నికలో ఎంపీపీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీంతో వైస్ ఎంపీపీ ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల అధికారి, డ్వామా పీడీ ఎ.విజయలక్ష్మి పర్యవేక్షణలో ఎన్నిక నిర్వహించారు. సోమవారం ఉదయం 10.45 గంటలకు వైఎస్సార్ సీపీకి చెందిన 9 మంది ఎంపీటీసీ సభ్యులు మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్నారు. చందోలు–1 ఎంపీటీసీ సభ్యుడు షేక్ బాజీ భవనంవారిపాలెం ఎంపీటీసీ సభ్యురాలు దొంతిరెడ్డి సింధు పేరును వైస్ ఎంపీపీ పదవికి ప్రతిపాదించారు. అల్లూరు ఎంపీటీసీ సభ్యురాలు వాలి కుమారి బలపరిచారు. ఎన్నిక నిర్ణీత సమయానికి వైస్ ఎంపీపీ పదవికి దొంతిరెడ్డి సింధు ఒక్కరే పోటీలో ఉండటంతో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి విజయలక్ష్మి ప్రకటించారు. అనంతరం ఎన్నికల అధికారి విజయలక్ష్మి దొంతిరెడ్డి సింధుకు ధృవీకరణ పత్రం అందజేసి ప్రమాణ స్వీకారం చేయించారు. వైస్ ఎంపీపీగా ఎన్నికైన సింధుకి ఎన్నికల అధికారి విజయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. చందోలు ఎస్ఐ మర్రి వెంకట శివకుమార్ యాదవ్ తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియలో తహసీల్దార్ డి.వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎలీషాబాబు, సూపరిటెండెంట్ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మండలంలోని ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తూ, వైఎస్సార్ సీపీ బలోపేతానికి పని చేస్తానని వైస్ ఎంపీపీ సింధు చెప్పారు. వైఎస్సార్ సీపీ బాపట్ల నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆశీస్సులతో తనకు ఉపాధ్యక్ష పదవి లభించినట్లు తెలిపారు. తనను ఎన్నుకున్న ఎంపీటీసీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.



ప్రమాణం చేస్తున్న వైస్ ఎంపీపీ డి. సింధు

అభినందనలు

వైస్ ఎంపీపీగా ఎన్నికైన డి.సింధును ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు, వైస్ ఎంపీపీ చేబ్రోలు కృపానందం, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు వాలి శివారెడ్డి, మండే విజయ్‌కుమార్, కుంటం ప్రసన్నరాజు, దోమా వెంకటేశ్వరరెడ్డి, దొంతిరెడ్డి కోటిరెడ్డి, తిరుమలరెడ్డి, బడుగు మాధవి, ఆరేపల్లి శివయ్య అభినందించారు.

జులై 5న మెగా లోక్‌అదాలత్

బాపట్ల: జాతీయ మెగా లోక్ అదాలత్ జులై 5న జరుగుతుందని కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్ కె.శ్యామ్ బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో అన్ని రకాల సివిల్ కేసులు, భరణం కేసులు, గృహహింస కేసులు, మోటార్ ప్రమాద కేసులు, రెవెన్యూ కేసులు, బ్యాంకు కేసులు, చెక్ బౌన్స్ కేసులు, రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, ముందస్తు రాజీ చేసుకోదలచిన కేసులు ఇరుపక్షాల మధ్య సామరస్య పూర్వకంగా రాజీ చేసి పరిష్కరించుకోవచ్చని తెలిపారు. బాపట్ల న్యాయస్థానాల పరిధిలోని కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం పరుచుకుని తమ వివాదాలను శాంతియుతంగా రాజీచేసుకుని పరిష్కరించుకోవాలని సూచించారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,000 గరిష్ఠం : రూ. 4,000

మోడల్ ధర రూ. 3,200



పసుపు ధరలు
(సోమవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 1048

కొమ్ములు : 783 బస్తాలు

కనిష్ఠ :	గరిష్ఠ : (ధర రూ॥ల్లో)	మోడల్ :
10,000	11,171	10,650

కాయలు : 265 బస్తాలు

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
10,000	11,171	10,650

మొత్తం అమ్మకాలు : 786.000 క్వింటాళ్లు

–దుగ్గిరాల

నిర్ణీత గడువులోపు అర్జీలు పరిష్కరించాలి

ఎస్పీ తుషార్ డూడీ


అర్జీదారు సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ తుషార్ డూడీ

బాపట్ల: అర్జీలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ పేర్కొన్నారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు వారి సమస్యలను స్వేచ్ఛగా ఎస్పీకి విన్నవించుకున్నారు. కుటుంబ కలహాలు, భర్త, అత్తారింటి వేధింపులు, భూ–ఆస్తి వివాదాలు, ఇతర సమస్యలపై వచ్చిన 50 అర్జీలను ఎస్పీ పరిశీలించారు. సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి అర్జీలను చట్ట పరిధిలో విచారించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారానికి తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని తెలిపారు. పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని పోలీస్ అధికారులను హెచ్చరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, పీజీఆర్ఎస్ సెల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఎస్ఐ శ్రీనివాస్ ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్మితే చర్యలు


ఆర్టీసీ బస్టాండ్‌లో షాపుల నిర్వాహకులతో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

చీరాల అర్బన్: తినుబండారాలు ఎమ్మార్పీ కంటే అధికంగా అమ్మితే చర్యలు తప్పవని చీరాల తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు హెచ్చరించారు. ప్రపంచ తూనికలు, కొలతలు దినోత్సవం ఈనెల 20న నిర్వహిస్తున్నామని చెప్పారు. అలానే తూనికలు, కొలతల విభాగం 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వారోత్సవాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వారోత్సవాల్లో భాగంగా సోమవారం చీరాల ఆర్టీసీ బస్టాండ్‌లోని స్టాల్స్‌ను పరిశీలించారు. స్టాల్స్ నిర్వహించేవారు ఎమ్మార్పీ కంటే ఎక్కువకు అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రయాణికులకు అమ్మే ప్రతి వస్తువును నిర్దేశించిన ధరలకు మాత్రమే అమ్మాలన్నారు. అలానే వస్తువు కొనుగోలు చేసే ముందు తూకం, ధరలు సరిచూసుకొని కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

రైతులకు మద్దతు ధర కల్పించేందుకు చర్యలు

- జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి
- 25వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు ప్రభుత్వ ఆమోదం


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: రైతులకు మద్దతు ధర కల్పించడంలో భాగంగా 25 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు ప్రభుత్వం ఆమోదించిందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి చెప్పారు. జిల్లా అధికారులతో సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో కలెక్టర్ సమావేశం అయ్యారు. వర్చువల్ విధానం ద్వారా డివిజన్, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ధాన్యం సేకరణలో ఎలాంటి సమస్యలు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల నుంచి సేకరించాలని లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 29 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. బయట మార్కెట్లో ధాన్యం ధరలు తగ్గడం, అకాల వర్షాల నేపథ్యంలో రైతులు నష్టపోతున్న నేపథ్యంలో ధాన్యం సేకరణ లక్ష్యం పెంచేలా అనుమతులు ఇవ్వాలని పలుమార్లు కోరినట్లు చెప్పారు. స్పందించిన ప్రభుత్వం తాజాగా 25వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు అనుమతులు ఇచ్చిందన్నారు. ధాన్యం సేకరణ వేగంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

బంగారు కుటుంబాలను గుర్తించాలి

పీ–4 విధానంలో బంగారు కుటుంబాలు మార్గదర్శిలను అనుసంధానించే ప్రక్రియ చేపట్టాలని ఎంపీడీవోలను కలెక్టర్ ఆదేశించారు. బంగారు కుటుంబాలకు మార్గదర్శిలు అందించే సహాయం ఎలా చేరవేయాలో ప్రణాళికలు రూపొందించాలన్నారు. నీటి తీరువా లక్ష్యం మేరకు వసూలు చేయాలన్నారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద పట్టణాలలో 2,500 యూనిట్లను స్థాపించాలని మున్సిపల్ కమిషనర్లకు లక్ష్యాలను నిర్దేశించామన్నారు. గ్రామీణ ప్రాంతాలలో సూర్యఘర్ యూనిట్ల స్థాపన ప్రతి ఎంపీడీవోకి 1500 యూనిట్లను లక్ష్యంగా ఇచ్చామన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేలా అధికారులు పనిచేయాలని సూచించారు. వాహనాలకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలన్నారు. రీ సర్వే ప్రక్రియ క్షేత్రస్థాయిలో వేగంగా జరిగేలా ఆర్డీవోలు, తహసీల్దార్లు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. గృహ నిర్మాణ లక్ష్యాలు వేగంగా పూర్తయ్యేందుకు పొజిషన్ సర్టిఫికెట్ల జారీలో జాప్యం ఉండరాదన్నారు. సమావేశంలో డీఆర్వో జి గంగాధర్‌గౌడ్,వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

జాతీయ యోగా దినోత్సవాన్ని ఈనెల 21వ తేదీన బాపట్ల కలెక్టరేట్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ బాపట్ల కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో ఈ నెల 21వ తేదీన సాయంత్రం 4:30 గంటలకు వెయ్యి మందితో యోగ ఆసనాలు వేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, సమాచార పౌర సంబంధాల, గృహ నిర్మాణశాఖల మంత్రి కొలుసు పార్థసారథి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, శాసనసభ్యులు పాల్గొంటారని తెలిపారు. యోగా దినోత్సవాన్ని పెద్దఎత్తున నిర్వహించాలని, ప్రజలలో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. సచివాలయాల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా నెలరోజులపాటు ఈ కార్యక్రమాలను అన్ని ప్రాంతాలలో నిర్వహించాలన్నారు. యోగా ద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాలపై విద్యార్థులకు పోటీ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విజేతలకు బహుమతులిచ్చి కార్యక్రమాన్ని మరింతగా ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, డీఈవో పురుషోత్తం, డీఆర్‌డీఏ శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నాటు సారా తయారీ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

నాటు సారా తయారీ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులకు తెలిపారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో లైన్ డిపార్టుమెంటు అధికారులతో కలెక్టర్ సోమవారం సమావేశం నిర్వహించారు. నాటు సారా నిర్మూలనకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నవోదయం 2.0 అనే కార్యక్రమాన్ని తలపెట్టిందని అన్నారు. జిల్లాలో నాటు సారా నిర్మూలనపై పొబిషన్, ఎక్సైజ్ అధికారులను ఆయన ఆరా తీశారు. నవోదయం 2.0 అమలుపై తీసుకున్న చర్యలను జిల్లా కలెక్టర్ కు ఎక్సైజ్ శాఖ అధికారులు వివరించారు. రాబోవు 15 రోజులలో జిల్లాలో నాటు సారా తయారు చేసే సమస్యాత్మకమైన 16 గ్రామాలలో దాడులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి గ్లోరియ, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నారాయణ భట్టు, ఎక్సైజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఏపీ ఈఏపీ సెట్ పరీక్షలకు 328 మంది హాజరు


పరీక్షలకు హాజరైన విద్యార్థులు

వేటపాలెం: సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ప్రారంభమైన ఏపీ ఈఏపీ సెట్ పరీక్షలకు 328 మంది విద్యార్థులు హాజరైనట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, సెక్రటరీ ఎం లక్ష్మణరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మొదటి షిఫ్టులో 176 మంది హాజరు కావాల్సి ఉండగా 164 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. సాయంత్రం రెండో షిఫ్టులో 176 మందికిగాను 164 మంది హాజరైనట్లు తెలిపారు. 24 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ జగదీష్‌బాబు తెలిపారు.

ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి

నలుగురికి గాయాలు


ట్రాక్టర్ కిందపడి మృతి చెందిన డ్రైవర్

సంతమాగులూరు (అద్దంకి రూరల్): క్వారీలో పనికి వెళ్తూ ట్రాక్టర్ తిరగబడి డ్రైవర్ మృతి చెందగా నలుగురికి గాయాలయ్యాయి. ఈఘటన ఆదివారం రాత్రి సంతమాగులూరు మండలం సజ్జాపురం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై పట్టాభిరామయ్య తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడుకు చెందిన ఇలుమలై నాగరాజ్ (44) సజ్జాపురం గ్రామంలో ఉన్న తిరుమల సాయిచంద్ర గ్రానైట్ క్వారీలో పని చేస్తుంటాడు. ఆదివారం రాత్రి ట్రాక్టర్ కొండ ఎక్కుతుండగా తిరగబడింది. ట్రాక్టర్ నడుపుతున్న నాగరాజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాక్టర్‌పై ఉన్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు డీఈవో కార్యాలయం ముట్టడి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ సంఘాలతో ప్రభుత్వం సోమవారం సుదీర్ఘంగా జరిపిన చర్చలు విఫలం కావడంతో ఈనెల 21న డీఈవో కార్యాలయ ముట్టడి యథాతథంగా నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీ నాయకుడు కె.బసవ లింగారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిపాదించిన డిమాండ్లు నెరవేర్చేందుకు ప్రభుత్వానికి ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో మంగళవారం వరకు వ్యవధిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

ఎక్కువ కేసులు పరిష్కరించేలా చర్యలు

నాలుగో అదనపు జిల్లా జడ్జి ఆర్.శరత్‌బాబు


ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులతో సమావేశమైన న్యాయమూర్తి

గుంటూరు లీగల్: ఈనెల 19 నుంచి జులై 5 వరకు జరగనున్న లోక్ అదాలత్‌లో మోటార్ వెహికల్ ప్రమాదాల కేసులు ఎక్కువ సంఖ్యలో పరిష్కరించడానికి కృషి చేయాలని నాలుగో అదనపు జిల్లా జడ్జి ఆర్. శరత్‌బాబు చెప్పారు. ఇన్సూరెన్స్ కంపెనీస్ ప్రతినిధులు, న్యాయవాదులతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. మోటార్ వెహికల్ ప్రమాదాల కేసుల సత్వర పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. కంపెనీ మెంబర్స్, కౌన్సెల్స్ పూర్తిగా సహకరించాలని ఆయన కోరారు. సమస్యలుంటే పిటిషనర్‌ను, అతడి కౌన్సెల్‌ను కూడా పిలిపించి ప్రీ సిట్టింగ్ ద్వారా కేసును రాజీ చేయాలని ఆయన సూచించారు. రెండో అదనపు జిల్లా జడ్జి వై. నాగరాజా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్, బార్ ప్రెసిడెంట్ వై.సూర్యనారాయణ, ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు, కౌన్సెల్స్‌కు పలు సలహాలు, సూచనలు చేశారు. వాటిని పరిశీలించాలని కోరారు.

సమావేశంలో బార్ కౌన్సెల్ సభ్యుడు వి.బ్రహ్మారెడ్డి, న్యూ ఇండియా, ఓరియంటల్, యునైటెడ్, నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు, కౌన్సెల్స్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురికి పదవులు

వేమూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గానికి చెందిన ముగ్గురికి రాష్ట్రస్థాయి పదవులు దక్కాయని, పార్టీ అధికార ప్రతినిధి, నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు సోమవారం తెలిపారు. వేమూరు నియోజకవర్గం అమర్తలూరు మండలానికి చెందిన షేక్ హుస్సేన్ రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడిగా, చుండూరు మండలానికి చెందిన కంఠమనేని శ్రీనివాసరావు పంచాయతీ వింగ్ జనరల్ సెక్రటరీగా ఎంపికయ్యారు. ఓ. శ్రీనివాసరావు రాష్ట్ర దివ్యాంగుల విభాగం సెక్రటరీగా ఎంపికయ్యారని వెల్లడించారు.

సజావుగా టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం జిల్లాలో సజావుగా జరిగాయి. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 27 పరీక్ష కేంద్రాల పరిధిలో దరఖాస్తు చేసిన 841 మంది విద్యార్థుల్లో 561 మంది హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల్లో అధికారులు తనిఖీలు నిర్వహించారు.

అదే.. ఆ తల్లి ప్రత్యేకత

ప్రత్యేక అవసరాలు గల బిడ్డలు ఎందరికో తల్లిగా మారింది

- మానసిక పరిణితి లేని ఆడపిల్ల నీహారిక
- కంటిపాపలా చూసుకున్న తల్లిదండ్రులు
- ఆనందాన్నీ, అవసరాలను వదులుకున్నారు
- బిడ్డ కోసం టీచరుగా మారిందా తల్లి
- ఇష్టమైన సైక్లింగ్‌లోనూ శిక్షణనిచ్చింది
- స్పెషల్ ఒలింపిక్స్‌లో పతకాలు నెగ్గేలా చూశారు
- ఇప్పుడా బిడ్డలాంటి మరికొందరికోసం ఏకంగా అలాంటి పాఠశాలనే నడుపుతోందా తల్లి


కుమార్తె నీహారికతో ముక్కామల భార్గవి

తెనాలి: ''అది 2019 సంవత్సరం మార్చి నెల. 14–21 తేదీల్లో దుబాయ్‌లో స్పెషల్ ఒలింపిక్స్ వరల్డ్ సమ్మర్ గేమ్స్. 25 గేమ్స్‌లో 170 పైగా దేశాలకు చెందిన ఏడు వేల క్రీడాకారులు పాల్గొన్నారు. మనదేశం నుంచి 280 మంది వివిధ పోటీల్లో తలపడ్డారు. ఇందులో సైక్లింగ్‌లో 16 మంది పాల్గొంటే, ఆంధ్రప్రదేశ్ నుంచి ఓ యువతి ఆ పోటీలో పాల్గొంది. ఆ పోటీల్లో యువతి 500 మీటర్లు, కిలోమీటరు పోటీలు రెండింటిలోనూ ద్వితీయ స్థానం సాధించి రజత పతకాలను కైవసం చేసుకుంది. రెండు కి.మీ పోటీల్లో ఆరోస్థానంలో నిలిచింది. ఆ యువతే 2018లో రాంచీలో నిర్వహించిన జాతీయ ఓపెన్ చాంపియన్‌షిప్ పోటీల్లో కిలోమీటరు సైక్లింగ్‌లో బంగారు పతకం, రెండు కి.మీ విభాగంలో రజత పతకం గెలిచి, స్పెషల్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది.'' మానసిక పరిపక్వత లేదని సమాజం ఈసడించింది. తనపై డబ్బు ఖర్చుచేసినా, శ్రమ వెచ్చించినా ఎలాంటి ప్రయోజనం లేదు... తిండి, బట్ట ఇస్తే సరిపోతుందని తలిదండ్రులకు జాగ్రత్తలు చెప్పింది. అయితే సమాజం మాటవిని ఆ పాపను తల్లిదండ్రులు వదిలేయలేదు. తనకోసం తమ ఆనందాల్నీ, అవసరాలనూ వదులుకున్నారు. మానసిక వికలాంగురాలైన తమ కూతురు నీహారికను తన కాళ్లపై తాను నిలబడేలా చేయాలని కంకణం కట్టుకున్నారు. విభిన్న ప్రతిభావంతుల ప్రత్యేక పాఠశాలలో చదివిస్తూ తనకెంతో ఇష్టమైన సైక్లింగ్‌లో శిక్షణనిస్తూ వచ్చిందా తల్లి భార్గవి. తద్ఫలితమే.. నీహారిక సాధించిన విజయాలు.

భార్గవి సొంతూరు చినపరిమి

భార్గవి సొంతూరు తెనాలి సమీపంలోని చినపరిమి. భర్త ఆర్మీ ఉద్యోగి ముక్కామల శివరామకృష్ణ. 2001లో తొలి కాన్పులో లక్ష్మీదేవి పుట్టిందని సంబరపడ్డారు. ఏడాదిన్నర వచ్చినా నడక రాకపోవటంతో అనుమానం వేసింది. ఉద్యోగరీత్యా అప్పుడు జమ్మూకశ్మీర్‌లో ఉన్నారు. 'ఒకసారి న్యూమోనియాకు ఇచ్చిన మందు ఓవర్‌డోస్ అయి, నాలుగురోజులు పాప కోమాలో ఉంది... తెలివొచ్చేసరికి మాటలు బాగా తగ్గిపోయాయి..చెప్పిందీ అర్థం చేసుకోవటం తగ్గింది. డ్రమ్స్ మోగినా, బాణసంచా పేలుళ్లు విన్నా, భయంతో వణికేది...పెరిగేకొద్దీ ఆ భయం ఎక్కువైంది' అని భార్గవి గుర్తుచేసుకున్నారు. అయిదో ఏడు వచ్చేసరికి ఆగ్రాకు వెళ్లారు. అక్కడి డాక్టర్లు 'ఇంటలెక్చువల్ డిసేబిలిటీ' అన్నారు. 'పిల్లలతో విపరీతంగా ప్రవర్తించేది అప్పుడే...డ్రమ్స్, బాణసంచా మోతకు భయపడిపోయేది. ఎవరినీ దగ్గరకు రానిచ్చేదికాదు...తనొక్కతే ఏదొక వస్తువుతో ఆడుకుంటూ ఉండేది...ఆ క్రమంలో సైకిల్ తనను బాగా ఆకర్షించింది...చిన్న సైకిల్ నడిపేది. పాడైపోతే కొత్తది కొనేదాకా ఊరుకునేది కాదు...ఆ ఆసక్తిని గమనించి ప్రోత్సహించాను' అన్నారు భార్గవి. అప్పటికి తనకు మరో బాబు కలిగాడు.

కుమార్తె కోసం త్యాగాలు..

పాప ఆరోగ్యం కారణంగా హైదరాబాద్‌కు బదిలీ చేయించుకున్నారు. ప్రత్యేక అవసరాల పిల్లల పాఠశాలలో చేర్పించారు. కొడుక్కి హోం వర్క్ చేయించేటపుడు, నీహారికను దగ్గరుంచారు. స్పీచ్ థెరపీనీ ఇప్పించారు. 2013లో విజయవాడకు వచ్చేశారు. 2013 నవంబరులో ఇలాంటి పిల్లల కోసం ఓపెన్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరుగుతాయని తెలుసుకున్నారు. 2014లో పార్టిసిపేట్ చేసేలా చూశారు. ప్రతిరోజూ తెల్లవారుజామున 4 గంటలకు పాపను నిద్రలేపటం, హైవేపై 10 కి.మీ ప్రాక్టీస్ చేయించి, ఇంటికి తీసుకొచ్చేవారు. తర్వాత 'ఆటిజమ్ రీసెర్చ్ అండ్ మల్టీ డిసిప్లిన్ స్కూలు'కు తీసుకెళ్లారు. నీహారిక కోసం తనుకూడా అదే స్కూలులో ఉద్యోగం చేశారు భార్గవి. శివరామకృష్ణ కూడా వలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నారు.

మరెన్నో విజయాలు..

2014లో భోపాల్‌లో జరిగిన ఓపెన్ ఛాంపియన్‌షిప్‌లోనూ కి.మీ, 2 కి.మీ విభాగాల సైక్లింగ్‌లో బంగారుపతకం, రజత పతకాన్ని నీహారిక సాధించింది. ఈ విజయంతో 2015లో లాస్‌ఎంజెల్స్‌లో జరిగిన స్పెషల్ ఒలింపిక్స్‌కు ఎంపికైనా, అనివార్య కారణాలతో సైక్లింగ్‌లో పాల్గొనేందుకు వీల్లేకపోయింది. యూనిఫైడ్ వాలీబాల్ గేమ్‌లో భారత జట్టుకు ఆడి, కాంస్య పతక సాధనకు తోడ్పడింది. రెండు స్పెషల్ ఒలింపిక్స్‌లో ఆడి పతకాలను సాధించటం నిస్సందేహంగా నీహారిక ఘనతే. ఇందుకు పునాది, పట్టుదల, తపన ఆమె తల్లి భార్గవిది. పట్టుదలతో కృషిచేస్తే సాధించలేనిది ఏదీ లేదనేందుకు నిదర్శనమే వీరి విజయం.


స్పెషల్ ఒలింపిక్స్‌లో తలపడుతున్న నీహారిక (ఫైల్)

విభిన్న ప్రతిభావంతులకు తల్లిలా..

తన బిడ్డ నీహారిక లాంటి మరికొందరి కోసం ఇప్పుడా తల్లి ఏకంగా స్కూలునే నడుపుతోంది. 2020లో ప్రజ్ఞ వెల్ఫేర్ సొసైటీని రిజిస్టరు చేశారు. 2022 నుంచి ఆ సొసైటీ తరపున సాయి అంకుర్ స్పెషల్ స్కూల్‌ను ఆరంభించారు. 2019లో స్పెషల్ ఒలింపిక్స్‌లో పతకాల సాధనతో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ప్రైజ్‌మనీతో మొదలుపెట్టిన స్కూలుకు ఇప్పుడు సొంత డబ్బులు పడుతున్నాయి. పిల్లల తల్లిదండ్రుల మద్దతు తోడవుతోంది. పిల్లలు తమ పనులు తాము చేసుకోవటం, అవసరాలను తీర్చుకోవటం, వాళ్ల కాళ్లపై వాళ్లు నిలబడేలా శిక్షణనివ్వటం తమ ఆశయమని చెప్పారు భార్గవి. తెనాలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డులోని 'సాయి అంకుర్ స్పెషల్ స్కూల్' ఇప్పుడు భార్గవి ప్రపంచం. 24 ఏళ్ల కుమార్తె నీహారికతో సహా పదిహేనుమంది విభిన్న ప్రతిభావంతులు అక్కడ ఉన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు అక్కడ పిల్లలకు రకరకాల యాక్టివిటీస్, ఆటలతో బోధన ఉంటుంది. రోజువారీ స్కూలుకు వెళుతూ రెమిడియల్ క్లాసుకు వచ్చేవారూ ఉన్నారని భార్గవి చెప్పారు. తనతోపాటు అక్కడ ముగ్గురు టీచర్లు, ఇద్దరు సపోర్టింగ్ స్టాఫ్ పని చేస్తున్నారు. పాప కోసం 'ఆటిజమ్ రీసెర్చ్ అండ్ మల్టీ డిసిప్లిన్ స్కూలు' టీచరుగా పనిచేసిన భార్గవి, ఇప్పుడు ఏకంగా అలాంటి స్కూలునే నడుపుతూ ఎందరికో తల్లిలా మారింది.


స్కూల్ వార్షికోత్సవంలో..